క్లుప్తంగా

పట్టణ ప్రణాళిక సిబ్బంది అంతర్గత బదిలీలు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో విధులు నిర్వహించే పట్టణ ప్రణాళిక విభాగం టీపీవోలు, టీపీబీవోలు, టీపీఎస్‌లను అంతర్గతంగా బదిలీ చేస్తూ వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఇటీవల జరిగిన బదిలీల్లో వచ్చిన కె.సునీత(టీపీవో)ను 57, 60, 61, 62, 63, 64 డివిజన్లకు కేటాయించగా, ఎస్‌కే రిజ్వానా(టీపీవో)ను 34, 35, 49, 55, 56 డివిజన్లకు కేటాయించారు. అలాగే ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్ గిరి(టీపీవో)ను 23, 24, 25, 26, 36 డివిజన్లతోపాటు 15, 16, 17, 18, 20, 21, 22 డివిజన్లకు బదిలీ చేశారు. జి.కృష్ణ(టీపీవో)ను 11, 12, 13, 14 డివిజన్లకు బదిలీ చేయగా ఎస్‌కె మతీన్‌మహజీజ్(టీపీఎస్)ను 2, 3, 4, 5 డివిజన్లకు బదిలీ చేశారు. అలాగే బి.మురళీగౌడ్(టీపీవో)ను 38, 39, 40, 41, 42, 43, 44, 45, 46, 47, 48 డివిజన్లకు బదిలీ చేశారు.

'బీఎన్‌ఆర్'లో వార్షికోత్సవ ఆఫర్లు

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ మహాత్మాగాంధీ రోడ్డులోని బీఎన్‌ఆర్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూమ్ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా జనవరి 30 ప్రారంభమైన ఆఫర్లు ఈ నెల 23 వరకూ ఉంటాయని షోరూమ్ మేనేజింగ్ డైరెక్టర్ బి.రోహిత్‌రెడ్డి, చైర్మన్ బి.నాగిరెడ్డిలు ఒక ప్రకటనలో తెలిపారు. తమ వద్ద ఆకర్షణీయమైన మంత్లీ అడ్వాన్స్‌డ్ బుకింగ్ ప్లాన్‌తో పాటు వివాహ వెడ్డింగ్ కలెక్షన్లు ఉన్నాయన్నారు. వెడ్డింగ్ కలెక్షన్స్‌లో ప్రతి బంగారు ఆభరణంపై ఫ్లాట్ 9 శాతం తరుగు వర్తింపజేయడంతో పాటు మేకింగ్ చార్జీలు ఉండవన్నారు. డైమండ్స్ ప్రారంభ ధర క్యారెట్ రూ.49,999 ఉంటుందని, పాత బంగారం ఎక్స్ఛేంజ్‌పై గ్రాముకు రూ.150 అదనంగా పొందవచ్చునని చెప్పారు.

డోన్ సీఐపై కఠిన చర్యలు తీసుకోవాలి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నంద్యాల జిల్లా డోన్ పట్టణానికి చెందిన న్యాయవాది లక్ష్మీశెట్టి కృష్ణప్రసాద్‌పై అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులకు గురిచేస్తున్న డోన్ సీఐ ఇంతియాజ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆంధ్ర న్యాయవాదుల సంఘం డిమాండ్ చేసింది. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆంధ్ర న్యాయవాదుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.రాజారామ్ మాట్లాడుతూ న్యాయవాది లక్ష్మీశెట్టి కృష్ణప్రసాద్‌ను గత కొద్ది నెలలుగా సీఐ ఇంతియాజ్ ఇబ్బందులకు గురిచేస్తున్నాడని చెప్పారు. పోలీసు ఉన్నతాధికారులు సీఐ ఇంతియాజ్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. న్యాయవాది మేడా శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో న్యాయవాదులపై వేధింపులు పెరిగిపోయాయన్నారు. న్యాయవాది కృష్ణప్రసాద్, హరి, సతీష్‌బాబు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు పుష్ కార్డులు అందించాలి

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థ పరిధిలోని పారిశుద్ధ్య కార్మికులందరికీ పుష్‌కార్టులు అందించాలని విజయవాడ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బుదె రాజా డిమాండ్ చేశారు. రాజరాజేశ్వరి పేట 56వ డివిజన్ శానిటరీ కార్యాలయం వద్ద మంగళవారం కార్మికుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్మికులకు చెత్త సేకరణకు కావలసిన పుష్‌కార్టులు చాలా తక్కువగా ఉన్నాయని అన్నారు. దీనిపై వీఎంసీ కమిషనర్ దృష్టి సారించాలని కోరారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు జక్కి జేమ్స్, కోశాధికారి నాగేశ్వరావు పాల్గొన్నారు.

క్యాన్సర్ నివారణపై అవగాహన

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు గొట్టిముక్కల సూర్యనారాయణరాజు నగరపాలకసంస్థ పాఠశాలలో మంగళవారం హెల్పింగ్ టుగెదర్ 2009 గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్, హెల్పింగ్ టుగెదర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ డెప్యూటీ గవర్నర్ కృష్ణప్రసాద్, జీ ఏడుకొండలు, డాక్టర్ బీ వసంతకుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలని సూచించారు.

ముగిసిన బొండా ఉమా ప్రీమియర్ లీగ్ క్రికెట్

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎస్‌ఆర్‌ఆర్ ప్రభుత్వ కళాశాల క్రీడా మైదానంలో మంగళవారం బొండా ఉమా ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన మొత్తం 38 టీమ్‌లు పోటీల్లో పాల్గొనగా గుణదలకు చెందిన శాండీ సీసీ ప్రథమ స్థానంలో నిలిచి రూ. 50వేలు, వన్‌టౌన్‌కి చెందిన భక్షు సీసీ ద్వితీయ స్థానం రూ. 25వేలు, టోర్నీ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ తపస్వి సీసీకి చెందిన జగదీశ్ రూ. 20వేలు నగదు అందుకున్నారు.

యథేచ్ఛగా.. మళ్లీ ఆక్రమణలు

- అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గిన టౌన్ ప్లానింగ్ సిబ్బంది
- లెనిన్ సెంటర్‌లో యథాస్థితికి చేరుతున్న ఆక్రమణలు



పాల బూత్ పక్కన ఆక్రమణలు తొలగిస్తున్న సిబ్బంది(ఫైల్)

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడలో అత్యంత రద్దీగా ఉండే సెంటర్లలో లెనిన్ సెంటర్ ఒకటి. వ్యాపార, వాణిజ్య కూడలి కావడంతో వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు వచ్చి తమకు కావాల్సిన వస్తువులు కొనుగోలు చేసి వెళుతుంటారు. ఏ వస్తువైనా ఈ సెంటర్‌లో లభిస్తుంది. ఈ సెంటర్‌లో వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా ఉంటుంది. వ్యాపార కూడలి కావడం, విశాలంగా ఉండటంతో రోడ్డును సైతం ఆక్రమించి వ్యాపారాలు చేస్తుంటారు. కాలు తీసి కాలు వేయడానికి కూడా వీలు లేకుండా బండ్లు ఏర్పాటు చేసి వ్యాపారాలు సాగిస్తున్నారు. అయితే కొందరి చేతుల్లో లెనిన్ సెంటర్ చిక్కుకుంది. ఇక్కడ వ్యాపారం చేసేవారు ఎవరి వాటాలు వారికి పంపుతుంటారు. టౌన్ ప్లానింగ్ అధికారులు వీరి జోలికి వెళ్లరు. కాగా ఇటీవల కాలంలో లెనిన్ సెంటర్‌లో ఆక్రమణలను తొలగించారు. షాపులు పూర్తిగా తొలగించి సెంటర్ విశాలంగా ఉండేలా చేశారు. దీంతో ఏలూరు రోడ్డు, బీసెంట్ రోడ్డు, గోపాల్‌రెడ్డి రోడ్డు ప్రాంతాల్లోని దుకాణాలకు వచ్చి వెళ్లే వారు వాహనాలు పార్క్ చేసుకునేందుకు అవకాశం లభించింది. దీంతో సెంటర్‌కు మహర్దశ వచ్చిందని అంతా భావించారు.

ఫిర్యాదు చేసినా చర్యలు నిల్

విజయ పాల బూత్ పక్కన ఓ దుకాణాన్ని టౌన్ ప్లానింగ్ అధికారులు పలు మార్లు తొలగించారు. విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ కనెక్షన్ కట్ చేశారు. ఎన్నిసార్లు తొలగించినా.. మళ్లీ అక్కడే బండి ఏర్పాటు చేసి వ్యాపారం సాగిస్తున్నారు. 25వ డివిజన్‌కు చెందిన అధికార పార్టీ చోటా నాయకుడుకి భారీ మొత్తంలో ఇచ్చి పాల బూత్ పక్కన బండి ఏర్పాటు చేసినట్లు సమాచారం. అతని ఒత్తిడికి తలొగ్గి టౌన్‌ప్లానింగ్ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇదే ప్రదేశంలో వైఎస్సార్ సీపీ సానుభూతిదారులు పెట్టుకున్న చిన్న షాపులను తొలగించారు. 25వ డివిజన్ టీడీపీ నాయకుడు పెట్టించిన షాపుల జోలికి అధికారులు వెళ్లలేదు. పాల బూత్ పక్కన టిఫిన్ బండి ఏర్పాటు, ట్రాఫిక్ ఇబ్బందులపై డివిజన్‌కు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. కానీ ఫిర్యాదుపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు.



మళ్లీ అక్కడే టిఫిన్ బండి ఏర్పాటు చేయించిన అధికార పార్టీ నేత

మూణ్నాళ్ల ముచ్చటే

లెనిన్ సెంటర్‌లో ఆక్రమణల తొలగింపు మూడు నాళ్ల ముచ్చటగా మారింది. టౌన్‌ప్లానింగ్ అధికారులు ఆక్రమణలు తొలగించి మూడు నెలలు కూడా కాలేదు. మళ్లీ ఒక్కొక్కటిగా షాపులు పుట్టుకొస్తున్నాయి. ఆక్రమణలు యథాస్థితికి చేరుతున్నాయి. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గిన టౌన్ ప్లానింగ్ అధికారులు మళ్లీ ఆక్రమణలు జరుగుతున్నా చోద్యం చూస్తున్నారు. అసలు తొలగింపు వెనుక అధికార పార్టీ నేతల హస్తం ఉందని కొందరు చర్చించుకుంటున్నారు. అడిగిన మొత్తం ఇచ్చిన వారే షాపులు పెట్టుకునేందుకు వీలుగా టౌన్ ప్లానింగ్ అధికారుల ద్వారా ఆక్రమణలు తొలగించారని వాదన వినిపిస్తోంది. ప్రస్తుతం అధికార పార్టీ నేతలు చిరు వ్యాపారుల వద్ద లక్షల్లో వసూలు చేసి అనువైన ప్రదేశంలో వ్యాపారం పెట్టిస్తున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

లెనిన్ సెంటర్ నుంచి ఏలూరు రోడ్డుకు వెళ్లే దారిలో ఉన్న ఆక్రమణలు తొలగించాలని పలువురు కోరుతున్నారు.



మాజీ సీఎం వైఎస్ జగన్‌కు వివాహ ఆహ్వానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గుంటూరు జిల్లా తాడేపల్లిలోని ఆయన నివాసంలో ఆ పార్టీ విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మంగళవారం కుటుంబ సమేతంగా కలిశారు. ఈ నెల 23వ తేదీన జరగనున్న తమ ద్వితీయ కుమార్తె వివాహ వేడుకకు హాజరు కావాల్సిందిగా వైఎస్ జగన్ దంపతులను ఆహ్వానించారు. ఈ మేరకు ఆహ్వాన పత్రిక అందజేశారు.

ప్రారంభోత్సవం.. వాయిదాల పర్వం

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురంలోని నూతన పోలీస్‌స్టేషన్ భవనం ప్రారంభోత్సవంలో వాయిదాల పర్వం కొనసాగుతోంది. ఇప్పటికే గత నెల 27వ తేదీన ప్రారంభోత్సవం కోసం పోలీసు అధికారులు సర్వం సిద్ధం చేసుకున్నారు. కానీ చివరి నిమిషంలో ఆయన (ప్రజా ప్రతినిధి) అందుబాటులో లేకపోవడంతో అధికారులు ఈ నెల మూడవ తేదీకి ప్రారంభోత్సవాన్ని వాయిదా వేసుకున్నారు. అయితే ఈ సారి ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో మరోసారి వాయిదా వేసుకోవాల్సి వచ్చింది. మార్చి మూడవ తేదీన ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ తొలగిపోవడంతో స్టేషన్ భవన ప్రారంభోత్సవం జరగవచ్చని పోలీసు అధికారులు భావిస్తున్నారు. నూతన భవన నిర్మాణ పనుల కారణంగా ప్రస్తుతం పోలీస్ స్టేషన్‌ను తాత్కాలికంగా ఏలూరు కాలువ వద్ద పోలీస్ గెస్ట్ హౌస్‌కు మార్చారు. అక్కడ అరకొర సౌకర్యాలతోనే సిబ్బంది విధులు నిర్వర్తిసున్నారు. ముఖ్యంగా మహిళా సిబ్బందికి తగినన్ని సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నూతన భవనంలోకి వెళితే అక్కడ ఆధునిక సౌకార్యాలతో తమకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని భావించిన సిబ్బంది ఆశలు వరస వాయిదాలతో నీరుగారిపోతున్నాయి.



సత్యనారాయణపురంలో నిర్మాణం పూర్తయిన పోలీస్ స్టేషన్ భవనం

మరియ మాతను ఆశ్రయిస్తే దీవెనలు

గుణదల(విజయవాడతూర్పు): మరియ మాతను ఆశ్రయిస్తే భక్తులకు సకల దీవెనలు లభిస్తాయని శ్రీకాకుళం మేత్రాసనం, భారత మిత్రం సంపాదకులు ఫాదర్ చల్లా డేవిడ్ రాజు అన్నారు. గుణదల మేరీమాత పుణ్యక్షేత్రంలో జరుగుతున్న మేరీమాత ఉత్సవాల నవదిన ప్రార్థనలర్థైదో రోజుకు చేరుకున్నాయి. మంగళవారం జరిగిన ప్రార్థనలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భక్తుల నుద్దేశించి ఆయన మాట్లాడుతూ.. మరియ మాతను ఆశ్రయించిన భక్తుల జీవితాలలో ఆశీర్వాదాలు నిండుతాయన్నారు. లోక రక్షకుడైన ఏసుక్రీస్తును ఈ లోకానికి అందించిన మరియతల్లి లోకమాతగా కీర్తించబడుతోందని చెప్పారు. అనంతరం మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రతీ ఏటా మరియ మాత తిరునాళ్లు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది ఉత్సవాలు మరింత ఘనంగా జరుగుతాయని చెప్పారు. తిరునాళ్లు దగ్గర పడుతున్న ప్రస్తుత తరుణంలో భక్తులు వేలాదిగా తరలివచ్చి మరియతల్లిని దర్శించుకుంటున్నారని పేర్కొన్నారు. ఉత్సవాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం సకల వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సమష్టి దివ్యబలి పూజ సమర్పించి భక్తులకు సత్ప్రసాదాన్ని అందజేశారు. అంతకు ముందు పలు విచారణ గురువులు, మత కన్యలు, పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై కొవ్వొత్తులు చేతపట్టి జపమాల ధ్యానంతో మేరీమాత స్వరూపం వద్దకు చేరుకున్నారు. ప్రత్యేక ప్రార్థనా కార్యక్రమాల్లో పాల్గొని దేవుని ధ్యానించారు. కార్యక్రమంలో రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు, ఫాదర్లు కొలగాని మరియన్న, సునీల్ రాజు తదితరులు పాల్గొన్నారు.



కొండ పైకి చేరుకుంటున్న భక్తులు

పోలీసు అధికారులు, సిబ్బందికి హెల్త్ కార్డులు

విజయవాడస్పోర్ట్స్: ప్రజా శాంతిభద్రతల పరిరక్షణకు నిత్యం పాటుపడే పోలీసులకు రాయితీతో వైద్య సేవలు అందించేందుకు 100 మంది డాక్టర్లు ముందుకురావడం అభినందనీయమని జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు అన్నారు. పోలీసు అధికారుల, సిబ్బంది కుటుంబ సభ్యులకు ఫ్రీ కన్సల్టెన్సీతో పాటు చికిత్సకు అయ్యే ఖర్చులో 20 నుంచి 30 శాతం రాయితీ కల్పించేందుకు నగరంలోని 25 ఆస్పత్రులు ముందుకు వచ్చాయి. దీని నిమిత్తం వీరు సిద్ధం చేసిన హెల్త్ కార్డులను పోలీసు సిబ్బందికి కమిషనరేట్ కార్యాలయంలో సీపీ రాజశేఖరబాబు మంగళవారం అందజేశారు. 25 ప్రముఖ ఆస్పత్రులకు చెందిన 100 మంది డాక్టర్లు న్యూరాలజీ, ఎలర్జీ, వెర్టిగో, డయాబెటాలజీ, రేడియాలజీ, ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ, ప్రసూతి, గైనకాలజీ, డెర్మటాలజీ, కాస్మోటాలజీ, గ్యాస్ట్రో ఎంటరాలజీ, కార్డియాలజీ, పల్మోనాలజీ, గ్యాస్ట్రో – ఆంకాలజీ, లాపరోస్కోపిక్ తదితర 30 ప్రత్యేక విభాగాల్లో పోలీసులకు, వారి కుటుంబ సభ్యులకు సేవలందించేందుకు రావడం సంతోషాన్ని ఇచ్చిందని సీపీ రాజశేఖరబాబు అన్నారు. హెల్త్ కార్డుల జారీలో కీలక పాత్రం పోషించిన 1991 బ్యాచ్ పోలీసు అధికారులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో డీసీపీలు గౌతమి శాలి, సరిత, ట్రైనీ ఐపీఎస్ మనీషా, 1991 బ్యాచ్ పోలీస్ అధికారులు మారుతీరావు, దామోదరరావు, కోటేశ్వరరావు, రత్నరాజు, మెహర్‌బాబు, సత్యానందం, దుర్గారావు, మురళీధర్, వంశీధర్‌గౌడ్, ధర్మేంద్ర, రాజీవ్‌కుమార్, భాస్కరరావు, రఘురామ్మోహన్, ప్రసాదరావు పాల్గొన్నారు.



వైద్య బృందంతో సీపీ రాజశేఖరబాబు, పోలీస్ అధికారులు

వీఎంసీ రెవెన్యూ సేవలు సద్వినియోగం చేసుకోండి

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలోని 64 డివిజన్లలో రెవెన్యూ విభాగానికి సంబంధించి ప్రజల నుంచి అనేకమైన సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని వీటిని పరిష్కరించేందుకు వీఎంసీ చర్యలు తీసుకుంటోందని డెప్యూటీ కమిషనర్(రెవెన్యూ) జి.సృజన మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కొత్తగా ఇంటి పన్నులు వేయటం(లేవీ ఆఫ్ న్యూ హౌస్ ట్యాక్స్), ఇంటి పన్ను పేరుమార్పు చేయటం(మ్యూటేషన్), కొత్తగా ఖాళీ స్థలం పన్ను విధింపు(లేవీ ఆఫ్ న్యూ వేకెండ్‌ల్యాండ్ ట్యాక్స్), ఖాళీ స్థలం పన్ను పేరుమార్పు(మ్యూటేషన్ ఆఫ్ వేకెంట్‌ల్యాండ్ ట్యాక్స్), ఇంటి పన్ను తగ్గింపు(రివిజన్ పిటిషన్) ఇంటి పన్ను విడగొట్టడం(సబ్ డివిజన్), ఇతర వివరాలు(డోర్ నంబరు తప్పులు సరిచేయటం, పేర్లు తప్పులు సరిచేయటం తదితరాలు) ఫిర్యాదులు వస్తున్నాయని వీటన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్ ద్వారా లేదా నేరుగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటుందన్నారు. ఆన్‌లైన్‌లో అయితే హెచ్‌టీటీపీ://సీడీఎంఏడాట్‌ఏపీడాట్‌జీవోవీడాట్‌ఇన్// ఆన్‌లైన్‌సర్వీసెస్/ప్రోపర్టీటాక్స్/ల్యాండ్‌టాక్స్(వీఏల్‌టీ) ద్వారా నిర్దేశిత ధ్రువీకరణ పత్రాలు జతచేసి దరఖాస్తు చేసుకోవాలన్నారు. నగర వాసుల సౌకర్యార్థం కూడా నగరంలోని 64 డివిజన్లలో ఉన్న సచివాయాలు, మూడు ప్రాంతాల్లో ఉన్న సర్కిల్ కార్యాలయాల్లో అసిస్టెంట్ కమిషనర్(రెవెన్యూ), నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె సూచించారు. ఈ అవకాశాన్ని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఛత్తీస్‌గఢ్‌లో తెలుగు మహాసభలు

విజయవాడ కల్చరల్: ఛత్తీస్‌గఢ్ తెలుగు సంఘాల ఆధ్వర్యంలో మార్చి 8, 9వ తేదీల్లో జాతీయ స్థాయి తెలుగు మహాసభలను నిర్వహించనున్నట్లు తెలుగు సంఘం కన్వీనర్ ఎల్. రుద్రమూర్తి తెలిపారు. విజయవాడ గవర్నర్‌పేట ప్రపంచ తెలుగు రచయితల సంఘం కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మూడు లక్షలకు పైగా తెలుగు వారున్నారని సాంస్కృతికంగా, సామాజికంగా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. సాంస్కృతిక పునర్ జీవనానికి అక్కడి తెలుగు సంఘాల సహకారంతో మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఛత్తీస్‌గఢ్ రాయపూర్ వేదికగా సభలు జరుగుతాయని చెప్పారు. ఉప ప్రధాన కార్యదర్శి ఎస్.గణేష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ నుంచి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, సాంస్కృతిక శాఖా మంత్రి కందుల దుర్గేష్‌తోపాటు ఇతర రాజకీయ ప్రముఖులు, సాహితీవేత్తలు మహాసభలో భాగస్వాములు అవుతున్నట్లు వివరించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే తెలుగు వారికి ఆహ్వానం పలుకుతున్నట్లు తెలిపారు. తెలుగు సంఘాల ప్రతినిధి కొండప్ప వెంకట్రావ్ మాట్లాడుతూ సభలో పాల్గొనే వారు 98274 08575 నంబరులో సంప్రదించాలని కోరారు. సమావేశంలో ప్రపంచ తెలుగు రచయితల సంఘం గౌరవ అధ్యక్షుడు మండలి బుద్ధప్రసాద్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జీవీ పూర్ణచందు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రుద్రమూర్తి, గణేష్, కొండలరావు

చిత్తడి నేలల సంరక్షణపై అవగాహన ర్యాలీ

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు మంగళవారం ఏకేటీపీ స్కూల్‌లో చిత్తడి నేలలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ 1971లో ప్రపంచ దేశాలు రాంసర్ ఒప్పందం ప్రకారం ప్రతి సంవత్సరం ఫిబ్రవరి రెండవ తేదీన ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవాన్ని జరుపుకొంటున్నట్లు తెలిపారు. చిత్తడి నేలలు జీవ వైవిధ్యం, పర్యావరణాన్ని కాపాడటంలో ప్రధాన పాత్ర పోషిస్తాయని విద్యార్థులకు వివరించారు. నేషనల్ గ్రీన్ క్రాప్స్ సమన్వయకర్త డాక్టర్ మామిడి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నో జీవరాసులు, మొక్కలకు చిత్తడి నేలలు ఆవాసంగా ఉంటాయని, ఇవి పర్యావరణ పరిరక్షణకు ఎంతో తోడ్పాటును అందిస్తాయన్నారు. ఈ నేలలు ఎక్కువగా సముద్ర తీర ప్రాంతంలో మాంగ్రూవ్ మొక్కల పెరుగుదలకు, పక్షుల పెరుగుదలకు కూడా ఎంతో తోడ్పడుతున్నాయని పేర్కొన్నారు. కాబట్టి చిత్తడి నేలలను అందరూ కాపాడుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్ర లేఖన పోటీలు నిర్వహించి, గెలుపొందిన విజేతలకు హ్యాపీ లైఫ్ ఫౌండేషన్ సహకారంతో బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరసింహారావు, సంధ్యారాణి, శివ, భరతలక్ష్మి, పద్మావతి విద్యార్థులు పాల్గొన్నారు.



చిత్తడి నేలలపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఏకేటీపీఎం స్కూల్ విద్యార్థులు

భక్తిశ్రద్ధలతో రథసప్తమి వేడుకలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలో రథసప్తమి వేడుకలను మంగళవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ముత్యాలంపాడు శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో మంగళవారం రథసప్తమి పర్వదినం సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు, సూర్య నమస్కారాలు జరిగాయి. స్వామివారికి ప్రీతిపాత్రమైన పాయసంను నైవేద్యంగా సమర్పించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు డీవీఎస్ రాజు, ఐఎస్ఎన్ రాజు పర్యవేక్షించారు. అలాగే ముత్యాలంపాడులోని శ్రీపట్టాభి రామచంద్రస్వామివారి ఆలయంలో రథసప్తమిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిత్య హృదమ పారాయణం జరిగింది. అనంతరం స్వామివారిని అందంగా అలంకరించిన రథంలో ఉంచి ముత్యాలంపాడులోని పురవీధుల్లో ఊరేగించారు.

సూర్యారాధనతో మనో వికాసం

సూర్యారాధనతో మనో వికాసం కలుగుతుందని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. రథసప్తమిని పురస్కరించుకొని మంగళవారం బుడమేరు వంతెన వద్దనున్న శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సకల జగత్తుకి వెలుగునిచ్చే సూర్యుడు రథాన్ని ఎక్కి తన దశ నిర్దేశాన్ని మార్చుకునే రోజు రథసప్తమి అని మల్లాది విష్ణు తెలిపారు.



పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

త్రినాథ్ దంపతులకు సన్మానం

పాయకాపురం(విజయవాడరూరల్): శ్రీసాయి మణికంఠ భిక్ష బృందం వ్యవస్థాపక అధ్యక్షుడు అగురు త్రినాథ్ గురుస్వామిని మంగళవారం 62వ డివిజన్ ఏపీఎస్ రెడ్డి రోడ్డులోని శ్రీసాయిబాబా ఆలయ ఆవరణలో స్థానికులు సత్కరించారు. కళాకారుల ఐక్య వేదికను స్థాపించి రంగస్థల కళాకారులను ప్రోత్సహిస్తూ, రంగస్థల నటుడిగా నాటక రంగానికి త్రినాథ్ సేవలందిస్తున్నారు. కళాకారులకు అందిస్తున్న సేవలను గుర్తించి తెలుగు వెలుగు సాహితీ సంస్థ వారు తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం త్రినాథ్‌కు నంది పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా త్రినాథ్ దంపతులను గురుస్వాములు పి.మోహన్‌రావు, పి.వైకుంఠరావు, ఎం.భాస్కరరావు, పి.సూరిబాబు, సింగర్ సిద్ధ గురుస్వామి, సాయి గురుస్వామి తదితరులు సన్మానించారు.



జిలానీఖాన్ సామాజిక సేవలు ఆదర్శం

విజయవాడ కల్చరల్: సంఘ సేవకుడు జిలానీఖాన్ సేవలను ఆదర్శంగా తీసుకోవాలని కళాపోషకుడు బీవీ వీరభద్రరావు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంస్కృతిక సామాజిక సేవా సంఘం ఆధ్వర్యాన కౌతా పూర్ణానందం కళావేదికపై మంగళవారం సంఘ సేవకుడు జిలానీఖాన్ తొలి వర్ధంతి సభ, సినీ సంగీత విభావరి నిర్వహించారు. డేవిడ్ రాజు మాట్లాడుతూ జిలానీఖాన్ పేద కళాకారులకు సాయం అందించేవాడని గుర్తుచేశారు. ఆదిరాల జయప్రభు, చింతకాయల చిట్టిబాబు, కారుమంచి రాజు, కొప్పుల ఆనంద్, పీ శ్రీనివాసరావు, మారేపల్లి జోషి, మాలపాటి వెంకటపతి పాల్గొన్నారు.

ప్రేమికుల రోజున 'తల' విడుదల



లబ్బీపేట(విజయవాడతూర్పు): తాను దర్శకత్వం వహించిన తల చిత్రాన్ని ఈ నెల 14వ తేదీ ప్రేమికుల దినోత్సవం రోజున విడుదల చేయనున్నట్లు ప్రముఖ కొరియోగ్రాఫర్, దర్శకుడు అమ్మ రాజశేఖర్ అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ తన కొడుకు రాగిన్ రాజ్ హీరోగా తెలుగు, తమిళ భాషల్లో చిత్రించిన తల సినిమా సంచలనాలు సృష్టిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ చిత్రంలో యాక్షన్ సన్నివేశాలు అద్భుతంగా ఉన్నాయని, హీరో, హీరోయిన్ మధ్య వచ్చే రోమాంటిక్ సన్నివేశాలు ప్రేక్షకులను అలరిస్తాయన్నారు. తెలుగు, తమిళ ప్రేక్షకులు వీక్షించి ఆదరించాలని కోరారు. సమావేశంలో హీరో రాగిన్ రాజు, హీరోయిన్ నోరా ఎస్తేర్ తదితరులు పాల్గొన్నారు.

గెలాక్సీ సామ్‌సంగ్ ఎస్ 25 ఆవిష్కరణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): కస్టమర్లకు నాణ్యమైన ఉత్పత్తులను అందించడమే తమ లక్ష్యమని సత్యా షోరూమ్స్ అధినేత సెంథిల్ సత్యా అన్నారు. విజయవాడలోని సత్య షోరూమ్‌లో మంగళవారం గెలాక్సీ సామ్‌సంగ్ ఎస్ 25 ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కస్టమర్ల కోసం నూతన ఆవిష్కరణ గెలాక్సీ సామ్‌సంగ్ ఎస్ 25 అందించడం ఆనందంగా ఉందన్నారు. కస్టమర్ల నుంచి లభిస్తున్న విశేష ఆదరణ ఈ డివైస్‌పై ఉన్న ఆసక్తిని ప్రతిభింబిస్తున్నాయని తెలిపారు.

ఒత్తిడిని ఎదుర్కొనే పద్ధతులపై వర్క్‌షాప్

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల ప్రాంగణంలోని గురుకుల కళాశాలలో మంగళవారం కళాశాల మహిళా సాధికారత విభాగం, ఇంక్లూజివ్ క్లబ్ ఆధ్వర్యాన ఒత్తిడిని ఎదుర్కొనే పద్ధతులపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వల్లూరు నీరజ మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ఉండేందుకు తాము వర్క్‌షాప్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రముఖ యోగా, మనస్తత్వ శిక్షకుడు అబ్దుల్ బాసిత్ మాట్లాడుతూ తీవ్ర మనోవేదన, ఉద్విగ్నతలను ప్రాణాయామం ద్వారా ఎదుర్కోవచ్చని సూచించారు. కార్యక్రమంలో మాధవి, మహిమ అనే మనస్తత్వ శిక్షకులు కూడా పాల్గొని విద్యార్థులకు పలు సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేత శేషు నారాయణ ఆకస్మిక మృతి



మధురానగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు మట్ట శేషు నారాయణ(62) సోమవారం సాయంత్రం గుండెపోటుతో ఆకస్మికంగా మృతిచెందారు. ఈయనకు భార్య, ఇద్దరు పిల్లలు. వైఎస్సార్ సీపీ అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేసిన నారాయణ మృతి తీరని లోటు అని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు.